జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

శుక్రవారం | 27 | జూన్ | 2025 ◆ పేజీలు : 5




## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను కలిసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి

**సత్తుపల్లి జూన్26(ప్రజా జ్యోతి ) :** తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గురువారం సెక్రటేరియన్ లో నూతనంగా మంత్రి అయిన సందర్భంగా ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అవసరమని వివరించారు.



# ఆదర్శ మండలంగా రఘునాథ పాలెం ను తీర్చిదిద్దుతాం....

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- రైతులు లాభసాటి ఆయిల్ పామ్ పంట సాగు చేయాలి.
- విద్య ద్వారానే మన పేదరికం దూరం అవుతుంది.

**రఘునాథపాలెం, ప్రజాజ్యోతి:** ఆదర్శంగా రఘునాథపాలెం మండలాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.మంత్రివర్యులు గురువారం నాడు రఘు నాథపాలెం మండలం పుతాని తండాలో ఎస్టీ.ఎస్.డి.ఎఫ్. నిధులు 20 లక్షలతో, సూర్య తండాలో 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవనం వరకు విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుత్ పోల్స్ వేయాలని అన్నారు. జీపీ భవనానికి కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని, స్టోర్ రూమ్ తొలగించి సమావేశ మందిరం గది విస్తీర్ణం పెంచాలని మంత్రి సూచించారు.జీపీ భవనంలో ఒక రూం ప్రత్యేకంగా రీడింగ్ రూం

మిగతా 2 లో...




## మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

### మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన ర్యాలీని ప్రారంభించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కారించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన ర్యాలీలో మమత మెడికల్ కాలేజ్ , హార్వేస్ట్ కాలేజ్, ఎస్ ఆర్ & జిజిఎన్ ఆర్ ఐ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు. మమత రోడ్డు లో గల టాటా మోటార్ సర్వీస్ సెంటర్ నుండి లకారం ట్యాంక్ బండ్ వరకు సాగిన ఈ ర్యాలీ ని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థల ) డాక్టర్ పి. శ్రీజ తో కలసి పోలీస్ కమిషనర్ జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించారు. మత్తుపదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదని విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి , యాంటి డ్రగ్స్ సోల్జర్ గా సైన్ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్


మిగతా 2 లో...

## సమస్యలు నిత్యకృత్యం..

# పరిష్కారంలో నిర్లక్ష్యం..!

- కచ్చా కాలువల ద్వారానే ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు
- పారిశుద్ధ్య లోపం తాండవిస్తున్నా... పాలకవర్గం, అధికారుల చర్యలు శూన్యం
- పాఠశాల పక్కనే మురుగునీరు అవస్థలు పడుతున్న విద్యార్థులు
- చిత్తడిగా మారిన బురద రోడ్లు

2 లో...



## వర్షాకాలం ని దృష్టిలో ఉంచుకొని వరదల ముందస్తు ప్రణాళిక

### మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో, ఖమ్మం నగరంలో గతంలో ఎదురైన వరద అనుభవాల్ని పునఃసమీక్షిస్తూ, ఈసారి మరింత మెరుగైన ప్రతిస్పందన కోసం ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య విస్తృత స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విభాగాల అధికారులు, విపత్తు నిర్వహణ సిబ్బంది, సంబంధిత డివిజన్ల ఇన్ చార్జ్ లు పాల్గొన్నారు. గత సంవత్సరం వరదల సమయంలో



నీటి మట్టం ఎంత వరకు పెరిగిందో, ఎన్ని కుటుంబాలు ప్రభావితమయ్యాయో, ముంపు ప్రాంతాలు ఎక్కడ ఉన్నాయో వంటి అంశాలను పూర్వ సమాచారం ఆధారంగా

మిగతా 2 లో...

## రామ్మూర్తికి ట్రై స్కూటీని అందజేసిన తుంబురు దయాకర్ రెడ్డి



పాలేరు జూన్ 26 ప్రజా జ్యోతి :కూసుమంచి మండలంలోని మునిగేపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడైన అప్ప గాని రామ్మూర్తికి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు క్యాంపు కార్యాలయంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి చేతుల మీదుగా ట్రై స్కూటీని అందజేశారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల మాజీ ఎంపీపీ జూకూరి గోపాల్ రావు ,మాజీ సర్పంచులు గుగ్గిల మోహన్, చాట్ల పరుశురాం తదితరులు పాల్గొన్నారు .

## డ్రగ్స్ అనర్థాలకు దారితీస్తుంది... యువత చదువుపై దృష్టి సారించాలి

- నేలకొండపల్లి ఎస్సై పి సంతోష్




నేలకొండపల్లి, జూన్ 26ప్రజా జ్యోతి:యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వాడకాన్ని నిర్మూలించి భావితరాలకు బంగారు బాటలు వేసేందుకు యాంటీ డ్రగ్స్ సోల్జర్స్ గా పనిచేయాలి అని. నేలకొండపల్లి ఎస్సై పి.సంతోష్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రము లోని స్టేషన్ నుండి స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు స్టూడెంట్స్ తో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు...... మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వారు సూచించారు. మాదకత్వాల సమస్య సామాజిక సమస్యగా మారింది. దీనిని నివారించేందుకు అందరం సమిష్టిగా పోరాడాలని అన్నారు. ఎవరైనా చెడు వ్యసనాలకు అలవాటు పడితే తల్లిదండ్రులు, స్నేహితులు గుర్తించి ప్రాథమిక స్థాయిలోనే వారించాలని సూచించారు. తద్వారా వారిని మత్తు పదార్థాల భారీ నుంచి కాపాడగలమని అన్నారు. మత్తు పదార్థాల వాడకంతో సమాజం నాశనం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సీతారాములు, పలువురు కానిస్టేబుల్స్. సేవాదళ్ నియోజక వర్గ కన్వీనర్ బచ్చలికూర నాగరాజు, కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ, బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, యాదవ్ సంఘం అధ్యక్షుడు తెల్లగొర్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ మండలంగా రఘునాథ పాలెం ను తీర్చిదిద్దుతాం...

(మొదటి పేజీ తరువాయి...)
క్రింద కేటాయించాలని అన్నారు. రఘునాథపాలెం మండలం ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని, తండాలలో పూర్తి స్థాయిలో సిసి రోడ్లు నిర్మిస్తున్నామని, పొలాలకు వెళ్లేందుకు కనీసం మట్టి రోడ్లు అందుబాటులో ఉండేలా చూస్తామని అన్నారు.రైతులు లాభసాటి ఆయిల్ పామ్ పంట సాగు విస్తరించాలని, అంతర్ పంటల క్రింద కూర గాయలను సాగు చేయవచ్చని అన్నారు. రఘునాథపాలెం మండలంలో స్వామి నారాయణ విద్యా సంస్థ, సమీకృత గురుకులాల నిర్మాణం జరుగుతున్నాయని, అవసరమైతే గిరిజనులకు మరో పాఠశాల తీసుకొని వచ్చి పిల్లలందరు చదువుకునేలా చూస్తామని అన్నారు.మన కుటుంబంలో ఒక వ్యక్తి బాగా చదువుకొని బాగుపడితే మనం పేదరికం నుంచి బయటకు వస్తామని మంత్రి తెలిపారు. పిల్లలకు అవసరమైన విద్యా అవకాశాలను స్థానికంగా అందుబాటులో తీసుకుని వస్తున్నామని అన్నారు. మంచుకొండ లో రైతు బజార్ ఏర్పాటు చేశామని, కూరగాయలు చెడిపోకుండా ఉండేందుకు అవసరమైతే ఏసి వాహనాలు సబ్సిడీపై అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. పెండింగ్ పనులను ఒక్కొక్కటిగా చేస్తున్నామని అన్నారు. 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయ లను రైతు భరోసా క్రింద రైతుల ఖాతాలో జమ చేశామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ మన గ్రామానికి రూపం గ్రామ పంచాయతీ భవనం అని, దీనిని పూర్తి చేసుకున్న గ్రామస్థులకు అభినందనలు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ భవనం పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, ఇక్కడ ఒక గదిని గ్రంథాలయం లాగా ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైన పుస్తకాలను అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. వానాకాలం వచ్చిన నేపథ్యంలో విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి జరగకుండా మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పుఠానితండా గ్రామంలో 9 మంది, సూర్య తండా గ్రామంలో 10 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిపిఒ ఆశాలత, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, ఎంపిడిఓ అశోక్ కుమార్, ప్రజా ప్రతినిధులు, వివిధ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలం ని దృష్టిలో ఉంచుకొని వరదల ముందస్తు ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి...)
పరిగణనలోకి తీసుకున్నారు. ముంపు ప్రాంతాల గుర్తింపు:గత ఏడాది ఎఫెక్ట్ అయిన డివిజన్లలో వరద ముంపు ప్రాంతా లను గుర్తించి, తక్షణ స్పందన కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది.వాలంటీర్లను నియమించి, వారికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు ఏర్పాటు చేయాలని.అన్నారు దీని గురించి ప్రతి ఒక్క వాలంటీర్స్ అవగాహన కల్పించాలని అన్నారు. హెచ్చరిక వ్యవస్థ: నీటి మట్టం 16 ఫీట్లు దాటినప్పుడు తక్షణం రిహాబిలిటేషన్ సెంటర్ కి ప్రజలను తరలించేలా ఏర్పాటు చేయాలని సూచించారు.రక్షణ పరికరాలు: వాలంటీర్లకు లైట్ రైన్ కోట్స్, లైఫ్ జాకెట్లతో పాటు వరద సమయంలో ఉపయోగించదగిన బోట్లు, లైట్లు, ఇతర సహాయక పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచిస్తూ వాలంటీర్లకు ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ బలగాలతో సహకార సమన్వయం చేస్తూ వారికి డివిజన్లో ఎక్కడ లోతట్టు ప్రాంతం ఎక్కడ ఉంది అనేది అవగాహన కల్పిస్తూ డివిజన్ మీద అవసరమైన శిక్షణలు ఇవ్వాలని అన్నారు.వాట్సాప్ కమ్యూనికేషన్ గ్రూపులు ప్రతీ డివిజన్ కు ప్రత్యేక గ్రూప్ ను యాక్టివ్ చేసి, సమాచార మార్పిడిని వేగవంతం చేయాలని సూచించారు.మాక్ డ్రిల్ ప్రణాళిక: రేపు అన్ని ప్రభావిత డివిజన్లలో మాక్ డ్రిల్ నిర్వహించి, వాస్తవ పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రాక్టీస్ చేయాలని కమిషనర్ ఆదేశించారు.రిహాబిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు ముంపు ప్రాంతాల్లో ప్రజలను తక్షణం తరలించడానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

## మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

(మొదటి పేజీ తరువాయి...)




మాట్లాడుతూ యువత పురోగతికి, భావి జీవితానికి అవరోధంగా నిలుస్తున్న మాదకద్రవ్యాలను సమాజం నుండి సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని విజ్ఞప్తి చేశారు.దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువత అని, అలాంటి యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. చెడు వ్యసనాలకు బానిసలై అనారోగ్యం పాలవుతూ బంగారు భవిష్యత్తును కోల్పోవడమే కాకుండా, ఎన్నో చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేస్తూ తమ చేతులారా భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, దానికోసమే ముందు గానే మత్తు పదార్థాలను నిర్మూలించి యువతను మత్తు అనే మహమ్మారి నుండి కాపాడుకోవాలని సూచించారు.జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు జిల్లాలోని కళాశాలలో, పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని ఉపాధ్యాయులకు, యాంటీ డ్రగ్ కమిటీలకు, డయల్ 100,1908, పోలీస్ వారికి అందించాలని సూచించారు.అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ..సరదా కోసం మొదలైన అలవాటు.. మత్తులోకి నెడుతోందని, గతంలో సిగరెట్, మద్యంతో సరిపెట్టుకునే యువత.. ఇప్పుడు నిషా కోసం గంజాయి, మాదకద్రవ్యాల బారినపడి మత్తుకు బానిసలవుతున్నారని అన్నారు.సమాజంలోని మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలని అన్నారు. తల్లిదండ్రులు నమ్మకంతో ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని అన్నారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ అధికారి రాంగోపాల్ రెడ్డి , డాక్టర్ నీతీశ్, ఇన్స్పెక్టర్లు భానుప్రకాశ్, కరుణకర్, స్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సమస్యలు నిత్యకృత్యం.. పరిష్కారంలో నిర్లక్ష్యం..!

పాలేరు జూన్26 ప్రజా జ్యోతి : అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యంతో పాలన గాడితప్పింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, క్షేత్రస్థాయిలో పట్టింపు లేకపోవడంతో.. పల్లెలు సమస్యల వలయంలో చిక్కుకుంటున్నాయి. కూసుమంచి మండలం తుర్కగూడెం గ్రామస్తులకు సమస్యలు శాపంగా మారాయి.

### నివాసాల చెంతనే మురుగు

అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో పాలన గాడితప్పింది.ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, క్షేత్రస్థాయిలో పట్టింపు లేకపోవడంతో.. పల్లెలు సమస్యల వలయంలో చిక్కుకుంటున్నాయి. కూసుమంచి మండలం తుర్కగూడెం గ్రామస్తులకు సమస్యలు శాపంగా మారాయి.భరించలేని దుర్గంధం,చిత్తడిగా మారిన బురద రోడ్లు, అసంపూర్తి పనులు వ్యాధులకు ఊతమిస్తోంది.సమస్యలు నిత్యకృత్యంగా కళ్లెదుటే సాక్షాత్కరిస్తున్నా..పరిష్కారమార్గానికి మోక్షంలేకుండా పోయింది.

### దోమలకు నిలయంగా.

గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడనే తిష్ట వేశాయి. చేపట్టాల్సిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టక పోవడంతో.. వీధుల్లోని స్థానికులను దుర్గంధం వెంటాడుతోంది. నివాసాల చెంతనే మురుగునీరు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారుతున్నా.. పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య లోపం తాండవిస్తున్నా.. పాలకవర్గం, అధికారుల చర్యలు శూన్యం. క్షేత్రస్థాయిలో ప్రణాళిక లేకపోవడంతో రహదారులు బురదమయంగా మారాయి. ఏ వీధికి వెళ్లినా.. చిత్తడి రోడ్లు దర్శనమిస్తున్నాయి. మోస్తరు వర్షానికే అధ్వాన్నంగా తయారై నడవలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. రూ. లక్షలు ఖర్చు చేసి సిమెంట్ రోడ్లు నిర్మించినా.. ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఆ దారులన్నీ.. బురదతో నిండుకుని ఉన్నాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. డ్రైనేజీలు సైతం పూడికతో నిండినా.. పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.

### అసంపూర్తి పనులతో అవస్థలు

ఇళ్ల పక్కన మురుగునీరు చేరడంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంది. పగలు రాత్రి లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో జ్వరాల బారిన పడుతున్నాం.



### మురికివాడలుగా మారుతున్నాయి

సరైన డ్రైనేజీ కాలువలు, రోడ్లు లేవు డబుల్ బెడ్రూమ్ కి వెళ్ళాలి అంటేనే అంత బురద మయంగా సిమెంటు రోడ్లు లేవు. కాలువలు కనిపించవు కేవలం కచ్చా కాలువల ద్వారానే ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. రెండు, మూడు వారాలకు ఒకసారి కూడా కాలువలను శుభ్రం చేసే పరిస్థితి కనిపించడం లేదు. దాంతో కచ్చా కాలువల్లో మురికినీరు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంటున్నది. దుర్వాసన భరించలేక,దీనికితోడు చిన్నపాటి వర్షం కురిసినా వర్షం నీరు కాలువల గుండా బయటకు వెళ్లలేక రోడ్లపైనే నిలువ ఉంటూ వర్షం నీరు, మురికినీరు కలిసి రోడ్లన్నీ గుంతలమయమై, బురదమయమై నడిచేందుకు వీలుకాని పరిస్థితి నెలకొంటున్నది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అయినా స్పందించి మా ప్రాంతాలలో రోడ్లతోపాటు డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

# పంచాయతీ అవార్డుల కోసం సూక్ష్మ ప్రణాళికలు



**నేలకొండపల్లి, జూన్ 26 ప్రజా జ్యోతి :** పంచాయతీల అవార్డుల కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సూక్ష్మ ప్రణాళికలను సిద్ధం చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం. యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయం లో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ను నిర్వహించారు. పంచాయతీల వారీగా 2023-24 లో జరిగిన అభివృద్ధి పై ప్రగతి సూచికల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...గత ఏడాది లో జరిగిన అభివృద్ధి పనుల ప్రకారం అవార్డుల కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఫార్మెట్ ప్రకారం కార్యచరణ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం పట్ల ప్రజలను అప్రమతం చేయాలని, గ్రామాల వారీగా అవగాహాన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, ఎస్సై సంతోష్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రములు వితరణ

- కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ దంపతులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** గురువారం కన్నం కనకయ్య 27 వ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు 46 డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ దంపతులు నూతన వస్త్రములు వితరణ చేశారు. తదనంతరం అందరూ కలిసి సమిష్టి భోజనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఉద్యోగి కన్నం కనకయ్య వర్ధంతి రోజున ప్రతి ఏటా స్మరిస్తూ సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆనవాయితీగా గురువారం పారిశుధ్య కార్మికులకు సేవలను గుర్తిస్తూ నూతన వస్త్రములు బౌకరించామని అన్నారు. కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉదయం లేచిన దగ్గర్నుంచి ఎంతో నిబద్ధతతో ఎటువంటి పరిస్థితులైన ఎదిరించి వీధులను పరిశుభ్రపరచడమే ధ్యేయంగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనిళమవని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు షేక్ రజ్జి, నాయకులు బాల్ దే నాగేశ్వర రావు, కన్నం రమేష్, వేముల విజయ్, సెల్వం జ్ఞానేశ్వర్, గర్శకోటి కిషన్, సుదగాని నరేష్, బచ్చసాయి, కంకల రాజేష్, మోటె జగదీష్, సానిటరీ సూపర్వైజర్ సాంబయ్య, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జవాన్ శ్రీనివాస్, లైన్మెన్ శ్రీనివాస్, మల్లేశం, కిరణ్, విజయ్ పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి... సిఐటియు

- నాలుగు లేబర్ కోళ్లను తక్షణమే రద్దు చేయాలి.



**సత్తుపల్లి జూన్26(ప్రజా జ్యోతి):** అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ సత్తుపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ కు సమ్మె నోటీస్ అందజేశారు. జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోల్డ్ గా తీసుకొచ్చిన వాటిని అమలు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని, ఈ చర్యలను భారత రాజ్యాంగం ఆర్టికల్ 19(1), ఆర్టికల్ 21, 24,39( డి ) సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు సందర్భంగా అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ కోడ్స్ అమలు చేస్తే, కార్మిక సంఘాల కూడా కష్టతరం అవుతుందని, అసంఘటితరంగా కార్మికులు కార్మిక వర్గం బానిసలుగా బతకాల్సి వస్తుందని, ఉద్యోగ భద్రత,ఉపాధి కోల్పోతారని, కార్మిక శాఖ కూడా నిర్వీర్యం కాపాడుతుందని, ఒక ఈ ఆలోచన తక్షణమే పాలకులు విరమింపజేయాలని జూలై 9న భారతదేశ వ్యాప్తంగా 10 కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు సమ్మె జరుగుతుందని అందులో భాగంగానే ఈరోజు ఐసిడిఎస్ సిడిపిఓ కు సమ్మె నోటీసు అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. యూనియన్ బాధ్యులు మరియమ్మ, శ్రీలక్ష్మి, షకీన నాగేంద్ర, విజయలక్ష్మి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కోలికపోగు సర్వేశ్వర రావు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావోద్దు




**నేలకొండపల్లి, జూన్ 26 ప్రజా జ్యోతి :** విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్. ఆలేటి పరంజ్యోతి అన్నారు. గురువారం కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.....మాదక ద్రవ్యాలు సేవించటం వలన కలిగే అనర్ధాలను విద్యార్ధి దశ నుంచే అవగాహాన కలిగించాలని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలన కు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్.ఎస్.శ్రీనివాసరావు, రమేష్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనపై భారీ ర్యాలీ



**కారేపల్లి, జూన్ 26, ప్రజా జ్యోతి:** మాదకద్రవ్యాల నిర్మూలన లో భాగంగా సింగరేణి మండలంలో గురువారం పోలీస్ శాఖ ఎంఈఓ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు . డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయాలి అనే స్లొగన్స్ తో కేజీబీవీ పాఠశాల, జడ్పీహెచ్ఎస్ కారేపల్లి విద్యార్థులు పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు బారి ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మండల విద్యాశాఖ అధికారి డ్రగ్స్ నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి డి జయ రాజు, ఎస్సై గోపి, కిషోర్ కుమార్, ఎక్స్చేంజ్ ఎస్ఐ, సిబ్బంది ,కారేపల్లి హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్యాం ప్రసాద్ పాఠశాల సిబ్బంది, కేజీబీవీ పాఠశాల ఎస్ఓ ఝాన్సీ సౌజన్య, పాఠశాల సిబ్బంది, ఎం ఆర్ సి సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం బి.సి. రిజర్వేషన్తో స్థానిక సంస్థల ఎన్నికలు- ఆర్.జే.సి కృష్ణ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** గురువారం జరిగిన బి.సి. ఎక్జుక్యూటివ్ సమావేశంలో ఆర్.జే.సి. కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం 42 శాతం బి.సి. రిజర్వేషన్ తో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని హామీ ఇచ్చి, హైకోర్టు ఆదేశాల పేరుతో ఎన్నికలు నిర్వహించాలని అనుకోవటం సరియైనది కాదని, సత్వరమే అఖిలపక్ష బేటీ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం మరియు బి.జే.పి. పార్టీల పై వత్తిడి తేవాలని అభిప్రాయపడ్డారు. కూరాకుల నాగభుషణం మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ తో ఎన్నికలు జరగనట్లయితే కాంగ్రేస్ తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని తెలియజేశారు. బొమ్మా రాజేశ్వరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ పేరుతో గతంలో 23 శాతం ఇవ్వగా ఇప్పుడు అది కూడా నష్టపోయే పరిస్థితి వచ్చిందని, కాబట్టి బి.సి.లు అందరు ఒకే తాటి పైకి వచ్చి 42 శాతం రిజర్వేషన్ పట్టుపట్టి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.సి. సంఘం నేతలు పాల్గొన్నారు.

## అర్చనాను ఆశీర్వదించిన తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు



**తల్లాడ, జూన్ 26 (ప్రజా జ్యోతి ):** తల్లాడ మండలంలోని బాలపేట గ్రామానికి చెందిన తొగరు కృష్ణయ్య, సైదమ్మ(లేటు), రమ్య దంపతుల కుమార్తె అర్చన ఓనీల అలంకరణ వేడుక గురువారం అన్నారుగూడెం గ్రామంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై చిన్నారికి అక్షింతలు చేసి దీవించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బాలపేట మాజీ సర్పంచ్ కోసూరు వెంకట నరసింహారావు, నాయకులు తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, బాలపేట నాయకులు, తోగరు కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఐ పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- తప్పుడు పిర్యాదు పై చర్యలు సరికాదు - ఐద్వా



**కారేపల్లి, జూన్27,ప్రజా జ్యోతి :** ఇల్లందు సీఐ బత్తుల సత్యనారాయణ పై సస్పెన్షన్ విధించిటం సరికాదు దానిని వెంటనే ఎత్తివేయాయలని ఐద్వా సింగరేణి మండల కార్యదర్శి కొండెబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ భార్యను వేధిస్తున్న ఎన్ఆర్ఐ సంబంధికులు ఇచ్చిన తప్పుడు పిర్యాదు అందుకోని తక్షణమే సీఐను సస్పెండ్ చేయటం తప్పుడు సంకేతాలు ఇస్తుందన్నారు. బాధితురాలు శ్రావ్య తన భర్త నవీన్‌రెడ్డి పై పిర్యాదు చేస్తే దానిని విచారించటం, భార్యభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చే క్రమంలో నవీన్‌రెడ్డి తల్లిదండ్రులు పోలీసులకు సహకరించక పోగా సీఐ పై తప్పుడు పిర్యాదు ఇచ్చారన్నారు. తప్పుడు పిర్యాదు పై సీఐ ను ఉద్వేశపూర్వకంగానే సస్పెన్షన్ చేసినట్లు కనపడుతుందని ఆరోపించారు. సీఐ సస్పెండ్ చేయటంతో న్యాయం కోసం పోలీసు స్టేషన్ వెళ్లే మహిళలకు న్యాయం జరగదని అపోహ పడే అవకాశం ఉందన్నారు. పోలీసు ఉన్నతాధికారులు వెంటనే తప్పు సరిదిద్దే ప్రక్రియ చేపట్టాలని కోరారు. బాధిత మహిళ శ్రావ్య కు న్యాయం చేయాలని లేకుంటే ఐద్వా అందోళన చేయనున్నట్లు పేర్కొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించిన డి.ఎం. ఈ. బృందం





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**
గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిపార్ట్మెంట్ ఆఫ్ మెడికల్ ఎడుకేషన్ రాష్ట్ర సంచాలకులు డా. నరేందర్ కుమార్, డా. ఇందిర, గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు బృందం మెడికల్ కళాశాలను సంధర్శించి అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు.గతంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ కళాశాలలను ఆన్లైన్ విధానంలో స్టాండర్డ్స్ ను పరిశీలించి తగిన సూచనలు అందించేవారు. ఇప్పుడు కళాశాలల నిర్వహణలో ప్రభుత్వానికి ప్రజలనుండి అనేక ఫిర్యాదులు రావడం వల్ల రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు ప్రత్యక్షంగా మెడికల్ కళాశాలను సంధర్శించి కాలేజ్ లో అన్ని వసతులు, సౌకర్యాలు, సిబ్బంది, నిర్వహణ పరమైన అన్ని విభాగాలను పరిశీలించి జిల్లా కమీటి ఆధ్వర్యంలో పరిశీలించిన విషయాలను అంతర్గత సమావేశం ద్వారా సమిక్షిస్తారు. గురువారం డి.ఎం.ఈ. రాష్ట్ర బృందం ఖమ్మం మెడికల్ కళాశాలలోని అన్ని విభాగాధిపతులను కలిసి ఆ విభాగం ఎలా వుంది, అందులోని రూం , ఫర్నీచర్ మొదలైన వాటి పరిస్థితి ఎలా వుంది, తగినంత సిబ్బంది వున్నారా, వాటర్, ఎలెక్ట్రీసిటీ, సానిటేషన్ విషయాలు అన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు.కళాశాల ప్రిన్సిపాల్ నుండి మరియు ఇతర కళాశాల సిబ్బంది నుండి కూడా సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.అన్ని వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ మరియు బాధ్యతాయుతమైన అధికారులను అడిగి తెలుసుకున్నారు.తదుపరి అడిషనల్ కలెక్టర్ ( లోకల్ బాడీస్ )డా. శ్రీజ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించగా స్టేట్ మెడికల్ కౌన్సిల్ బృందం తమ పరిశీలనలో వచ్చిన విషయాలను వివరించారు. మరిన్ని సదుపాయల కోసం విస్తృతంగా చర్చించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేశ్వర్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి, గవర్నమెంట్ జనరల్ హాస్పటల్, ఖమ్మం మెడికల్ సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్ మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డా. సృజన తదితరులు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ బృందంతో వున్నారు.

## ప్రజలకు, బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్



**కారేపల్లి, జూన్26, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలంలో వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ గురువారం విస్తృతంగా పర్యటించారు. తమ నాయకుడి రాకతో ఆనందోత్సవంలో అభిమానులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని వెంకటియా తండా బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బాణోత్ భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. భాస్కర్ దశదిన కర్మకు హాజరై వారి చిత్ర పటానికి పూలతో నివాళులర్పించి, 50కేజీల బియ్యాన్ని ఆర్థిక సహాయం అందించారు. అనంతరం వాంకుడొత్ గోపాల్ నాయక్ సోదరుడి కుమారుడు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. జర్పుల లాలు ఇంట్లో తేనేటివిందును స్వీకరించారు. ఈకార్యక్రమంలో వారి వెంట వైరా నియోజకవర్గ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ బాణోత్ దేవ్లా నాయక్, సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగిలాల్, మాజీ సర్పంచ్ లు బాణోత్ శంకర్, భూక్య రంగారావు, గుగులోతు భగవాన్ లాల్, ఇస్లావత్ కృష్ణ, ఇల్లందు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాంకుడొత్ నరేష్ నాయక్, నాయకులు అడపా పుల్లారావు, బత్తుల శ్రీనివాస్, అజ్మీర వీరన్న, జాల సాంబ, కడారి ఉపేందర్, బుజ్జి, బానోత్ బాలు నాయక్, మాలోత్ శోభన్ బాబు, డాక్టర్ బాబులాల్, జర్పుల జగన్, ఆంగోతు రవి కుమార్, బానోత్ ప్రేమ్ కుమార్, బానోత్ వెంకట్రాం, బానోత్ రమేష్, డిష్ రవి, గుగులోత్ శ్రీను, భూక్య కిషోర్, గూగులోత్ సోనియా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై మంత్రికి వినతి పత్రం

- సిపిఎం పార్టీ మండల కమిటీ



**రఘునాథపాలెం మండలం ప్రజా జ్యోతి :** పుటాని తండా గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావుకు రఘునాథపాలెం సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం సిపిఎం పార్టీ మండల నాయకులు బానోతు నాగేశ్వరరావు చేతుల మీదుగా వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రంలో గ్రామంలో అంగన్వాడి కేంద్రానికి తక్షణమే భవనం ఏర్పాటు చేయవలసిందిగా, గ్రామంలో ప్రస్తుతం రేషన్ మినీ దుకాణాన్ని ఏర్పాటు చేశారని, దానిని రెగ్యులర్ చేసి, ప్రత్యేక రేషన్ షాపును ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరారు. వ్యవసాయ భూములకు వెళ్లే డొంక రోడ్లు వర్షాకాలంలో బురదమయంగా మారి రైతులు వ్యవసాయ భూములకు పనులకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిని తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని వారు కోరారు. గ్రామపంచాయతీలో ప్రస్తుతం తడి పొడి చెత్త సేకరణ చేపట్టడం లేదని, చేపట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామంలో ఉన్న నిరుపేదలు ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, తెలియజేశారు. మండల వ్యాప్తంగా రైతులు ఎక్కువగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, వాటికి అవసరమయ్యే బిందు సేద్యం, మరియు మల్చింగ్ సబ్సిడీ రూపంలో ప్రతి ఒక్క రైతుకు ఆర్థిక సాయం ప్రభుత్వం ద్వారా అందించాలని వారు తెలియజేశారు. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ముక్కుడి కుంట చెరువుకు సాగర్ జలాలతో నింపి, రైతులకు రెండు పంటలు పండించే విధంగా రైతులకు సౌకర్యం చేయాలని మంత్రికి వినతిపత్రంలో పేర్కొన్నారు. సిపిఎం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి, గుగు లోతు హరి, ఆకారపు కృష్ణ, ఆకారపు వీరయ్య, సక్కుబాయి, షీలా, తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో గిరిజన బాలుర హాస్టల్

- వర్షం పడితే చాలు బిక్కు బిక్కుమంటూ విద్యార్థులు అగచాట్లు
- సుబ్లేడ్ ఎస్టి హాస్టల్ లో ఉన్న సమస్య లను, పరిష్కరించాలి
- ట్రైబల్ వెల్ఫేర్ డిడి విజయలక్ష్మి కి బీఎస్పీ పార్టీ వినతిపత్రం.





**తిరుమలాయపాలెం, జూన్ 26, ప్రజా జ్యోతి :** శిథిలావస్థలో గిరిజన బాలుర హాస్టల్, వర్షం పడితే చాలు స్లాబ్ నుంచి వర్షం కారుతున్న దృశ్యం, బిక్కు బిక్కుమంటూ విద్యార్థుల అగచాట్లు. వివరాల్లోకి వెళితే తిరుమలాయపాలెం మండల కేంద్రంలో వున్న సుబ్లేడు ఎస్టి హాస్టల్ ను పాలేరు నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు ఎన్నబోయిన రమేష్ యాదవ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొమ్ము పూలే వెళ్లి సందర్శించి నారు. దీనిలో భాగంగా, బీఎస్పీ పార్టీ అసెంబ్లీ అధ్యక్షులు ఎన్నబోయిన రమేష్ యాదవ్, మాట్లాడుతూ, సుబ్లేడ్ ఎస్టి హాస్టల్. ను తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఉన్న బిల్డింగులో ఉంచడం జరిగింది. ఇది శిథిలావస్థలో ఉన్న ది, భారీ వర్షాలు వచ్చినప్పుడు, వంట గది కురుస్తుంది, విద్యార్థులు ఉంటున్న రూములు కూడా, పై స్లాబ్ చెమ్మ వచ్చి, చినుకులు పడటం తో, విద్యార్థులు రాత్రి వేళ లో పడుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు, బిల్డింగు కూడా పగుళ్లు వచ్చి, ప్రమాదపు టంచున ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి, ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యులు ఎవరు వహిస్తారని బహుజన్ సమాజ్ పార్టీ హాస్టల్ ను విజిట్ చేయడానికి వచ్చిన ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి కి ఇట్టి విషయం ను వివరించి, వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వెంటనే, స్పందించిన డిడి వీటి మరమ్మత్తుల కోసం పై అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. వెంటనే ఇట్టి సమస్యలపై అధికారులు, పాలేరు నియోజకవర్గ శాసనసభ్యులు, రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించాలని, బీఎస్పీ డిమాండ్ చేస్తుంది అని తెలియజేశారు.

## ఎర్రబోడు పాఠశాల విద్యార్థులకు స్కూల్ కిట్ వితరణ



**కారేపల్లి, జూన్27, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని ఎర్రబోడు ప్రాధమిక పాఠశాల విద్యార్థులకు కేవైఏ ఖమ్మం యూత్ అసోసియేషన్, ఎన్జీవో ఆధ్వర్యంలో స్కూల్ కిట్టును వితరణ చేశారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్, ఇతర సామాగ్రిని అందజేశారు. ఈకార్యక్రమంలో కోమట్లగూడెం హైస్కూల్, ఎర్రబోడు స్కూల్ హెచ్ఎంలు టీ.శారద, పీ.చంద్రశేఖర్, రమేష్, మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, జీపీ కార్యదర్శి రాజేశ్వరి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పద్మవీణ, ఉపాధ్యాయులు రమాదేవి, కుర్సం కృష్ణకుమారి, ఉమాదేవి, గ్రామపెద్దలు పండగ కొండయ్య, బొజెడ్ల గోవిందరావు, ముక్కపాటి మోహన్ రావు, రాంబాబు, రామకృష్ణ, నరేందర్, యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జిలుగులను పొలంలో కలియ దున్నటం వల్ల రైతులకు ఎంతో మేలు

- మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి



**పాలేరు జూన్ 26 ప్రజా జ్యోతి**
కూసుమంచి మండలంలోని నేలపట్ల గ్రామంలో పచ్చి రొట్టె పైరు అయిన జీలుగను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ సుమారు 40 రోజుల దశలో జీలుగును భూమిలో కలియ దున్నడంవల్ల భూమికి కావలసిన సేంద్రియ పదార్థం , నత్రజని వంటి ముఖ్య పోషకాలు అందుతాయని తెలియజేశారు. పచ్చిరొట్ట పేర్లు వేసిన భూమిలో నత్రజనిని తక్కువ మోతాదులో వినియోగించాలని సూచించారు. అనంతరం నత్రజని ఎరువులు అయినటువంటి యూరియాను అధికమవుతాదులో వాడటం వల్ల భూమిలో సారం తగ్గి చీడపీడల ఉదృతి అధికంగా ఉంటుందని, యూరియాను సిఫారసు చేసిన మోతాదు మేరకు వినియోగించాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గట్టుసింగారం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి వంశీ రైతులు పాల్గొన్నారు.

# ఇన్సూరెన్స్ - షోరూంల సిండికేట్ దందా

- మోసపోయిన వాహనదారుడు
- ఖమ్మం గీతా షోరూం నిర్వాకంతో లబో దిబో మంటున్న బాధితులు
- విలేకరుల సమావేశంలో న్యాయం చేయాలని బాధితుడు కొప్పెర వెంకటేశ్వర్లు వేడుకుంటున్నాడు






**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ ద్వారా ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందని వాహనం కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ ఆయా వాహనాల పేరు మీద ఇన్సూరెన్స్ చేయించుకోవడం ఆనవాయితీ. కానీ వాహనం కొనుగోలు చేసిన షోరూం ఇన్సూరెన్స్ కంపెనీ సిండికేట్ అయి వాహనదారులను మోసం చేస్తే వారి బాధ వర్ణనాతీతం. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం వల్లపురం రావిచెట్టు గ్రామాని చెంది వ్యవసాయ కూలీ చేసుకునే కొప్పెర వెంకటేశ్వర్లు తన భార్య పేరు మీద టాటా మోటార్ కంపెనీకి చెందిన డీసీఎం వ్యాన్ ను ఖమ్మం నగరం శ్రీశ్రీ సర్కిల్లోని గీత షోరూంలో కొనుగోలు చేసి మూడు నెలల తర్వాత ప్రమాదం జరిగితే కొనుగోలు చేసిన షోరూం ఇన్సూరెన్స్ కంపెనీ సిండికేట్ అయి మోసం చేశాయని ఖమ్మం ప్రెస్ క్లబ్లో తన ఆవేదనను వ్యక్తం చేశాడు. గురువారం ఖమ్మం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొప్పెర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జూన్ 3, 2024న రూ.35 లక్షలకు ఖమ్మంలోని గీతా షోరూమ్ లో టాటా కంపెనీకి చెందిన డీసీఎం (టిజి 29టి0901) (మోడల్ 1916) ను రూ. 31.21 లక్షల ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ తో కొనుగోలు చేశానని తెలిపాడు. 3 నెలల అనంతరం ఆంధ్ర ప్రదేశ్ ఒంగోలు దగ్గర సింగరాయ కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదం జరిగితే సంబంధిత ఇన్సూ రెన్స్ కంపెనీకి సమాచారం ఇచ్చి, ఖమ్మం గీతా షోరూం మహమ్మద్ అబ్జల్ అలీ తెలియజేశాను అన్నారు. ఒంగోలు లోని ఎంజి బ్రదర్స్ షోరూమ్ కు వాహనాన్ని తరలించి దానిని బాగు చేయుటకు గీత షోరూం అబ్దుల్ అలీ ద్వారా రూ 1.35 లక్షల రూపాయలు కట్టించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. 45 రోజులలో రిపేర్ చేయి స్తానని సుమారు పది నెలలు అక్కడే ఉంచుకొని ఇన్సూరెన్స్ డబ్బు క్లెమ్ చేసుకొని నన్ను ఇబ్బందులు గురి చేశా రని వాపోయాడు. టాటా మోటార్ నిబంధనల ప్రకారం 90 రోజులో ఇవ్వాల్సిన బండిని ఇవ్వకుండా ఇబ్బం ది పెట్టారన్నారు. ఒంగోలు నుండి ఖమ్మం గీత షోరూం కు డిసియం ను తీసుకొస్తే డబ్బులు కడితే బాగు చేస్తా లేకుంటే తీసుకెళ్లమన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ. 51,500 లు కడుతున్నా కానీ ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్, ఒంగోలు ఎంజి బ్రదర్స్ షోరూమ్, ఖమ్మం గీతా షోరూం సిం డికేట్ అయ్యి తనకు తీవ్ర అన్యాయం చేశారని, మానసికంగా శారీరకంగా ఆర్థికంగా ఎంతో నష్ట పోయానని తన కు న్యాయం చేయాలని వేడుకున్నా డు. ఈ విలేకరుల సమావేశంలో భార్య వరలక్ష్మి నాగయ్య బుద్ధి వెంకన్న నరేష్ పాల్గొన్నారు.

## గంజాయి, మాదకద్రవ్యాల అలవాటు కుటుంబానికి, సమాజానికి హానికరం

- ఏసీపి తిరుపతిరెడ్డి




**తిరుమలాయపాలెం, జూన్ 26, ప్రజా జ్యోతి :** గంజాయి, మాదకద్రవ్యాల అలవాటు కుటుంబానికి, సమాజానికి హానికరం. ఎంతోమంది యువత వాటికి బానిసై తమ అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏసీపి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మాదక దవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గ్రామాలలో యువతి, యువకులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి ఎం తో నష్టపోతున్నారు, ప్రమాదాలకు గురవుతున్నారు, కుటుంబ ఆర్థిక పరిస్థితులు దిగజారిపోతున్నాయి, మాదకద్రవ్యాల మత్తులో అసాంఘిక కార్యకలాపాలు కూడా కారణమవుతున్నారు అని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక్క రూ వీటిని అరికట్టడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. మాదాకద్రవ్యాలు వాడటం వలన కుటుంబం జీవితం అస్తవ్యస్తంగా మారే అవకాశం ఉందని అన్నారు, ప్రతి ఒక్క పౌరుడు మాదకద్రవ్యాలను అరికట్టే దిశగా కృషి చేయాలని, ఆరోగ్యకరమైన సమాజానికి పునాదులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, తిరుమలాయపాలెం ఎస్ఐ కూచిపూడి జగదీష్, అదనపు ఎస్సై రామలింగారెడ్డి, సిబ్బంది వీరస్వా మి, వెంకటేష్, రాజు, సర్దార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థల విధ్వంసంను అడ్డుకోవాలి

- రైతు, కూలీల హక్కులు తిరస్కరణ నియంతృత్వం
- రబీ సీజన్ ధాన్యం బోనస్ విడుదల చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



**వైరా జూన్ 26 ప్రజాజ్యోతి :** – దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థల విధ్వంసం ను అడ్డుకోవాలి అని, రైతు, కూలీల హక్కుల తిరస్కరణ కూడా నియంతృత్వమే అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. బుధవారం గోల్లెన్ పాడ్ గ్రామం లో రైతు సంఘం ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ విధించి ఏబై సంవత్సరాల సందర్భంగా ప్రజాస్వామ్య వ్యవస్థ కు ఎదురవుతున్న సవాల్ పై జరిగిన సదస్సులో రాంబాబు మాట్లాడుతూ దేశంలో మెజారిటీ ప్రజల హక్కులను తిరస్కరించడం నియంతృత్వం అన్నారు, ప్రజలకు సరైన ఆహారం, విద్య, వైద్యం అందించకపోడం కనీసం పార్లమెంటు లో వ్యవసాయ రంగం, ఉపాధి, విద్య, వైద్యం పై విస్తృతమైన చర్చ జరపకుండా దాటవేత వైఖరి కూడా అప్రజాస్వామిక చర్య గా పరిగణించాలి అన్నారు, సాంకేతిక కారణాల వల్ల డబ్బు జమ కానీ రైతులకు రైతు భరోసా అందించాలని కోరారు, రబీ సీజన్లో ధాన్యం బోనస్ ఖమ్మం జిల్లా లో 63 కోట్ల రూపాయలు పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి వెంపటి రాజా, అమరనేని వెంకటేశ్వరరావు, నల్లమోతు రాజా బాబు, కోణిదెన ధర్మారావు, అమరనేని సాంబశివరావు, చంద్ర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు చర్యలు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- రాంక్యా తండా ఎంపిపిఎస్ పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్





**రఘునాథపాలెం ప్రజా జ్యోతి :** ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, గురువారం రఘునాథపాలెం మండలం రాంక్యా తండా ఎంపిపిఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వినూత్న పద్ధతులలో పాఠ్యాంశాలను బోధిస్తూ విద్యార్థులకు అర్థమయ్యేలా చూడాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను సైతం భాగస్వామ్యం చేయాలని, రెగ్యులర్ గా పేరెంట్ టీచర్ మీటింగ్ ప్రతి నెలా నిర్వహించాలని అన్నారు. పిల్లలకు చదువుతో పాటు విలువలు కూడా నేర్పించాలని అన్నారు. పాఠశాల తనిఖీ సమయంలో ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరుల పాల్గొన్నారు. జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయం, ఖమ్మంచే జారీ చేయనైనది.

## పంచాయతీ కార్యదర్శి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**తిరుమలాయపాలెం, జూన్ 26, ప్రజా జ్యోతి :** విధి నిర్వహణలో ఉన్న పంచా యతీ కార్యదర్శు పై అనుచిత వ్యాఖ్యలు చేసి చంపుతానని బెదిరించిన వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం తిరుమలాయపాలెం మండలం బచ్చో తండా గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న గంజి విద్యాసాగర్ జూన్ 24న బచ్చోడు తండా గ్రామపంచాయతీలో తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, జాయింట్ కలెక్టర్ శ్రీజ, సూచన మేరకు ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించగా అదే గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరైన లబ్ధిదారుడు భూక్య శ్రీను బేస్ మట్టం ఫోటో అప్లోడ్ చేసేందుకు పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ అక్కడికి వెళ్లగా అదే గ్రామానికి చెందిన ధరావత్ బుజ్జి అనే మహిళ అటుగా వెళ్తూ పంచాయతీ కార్యదర్శి తో దురుసుగా మాట్లాడి అనుచిత వ్యాఖ్యలు చేసుకుంటూ వెళ్ళగా మౌనంగా ఉన్న పంచాయతీ కార్యదర్శి తన పని తాను చేసుకుంటూ ఉండగా మరికొద్ది సమయంలో బుజ్జి కొడుకు ధరావత్ సాయి హైదరాబాదు నుండి సెల్ ఫోన్ ద్వారా ఫోన్ చేసి పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ తో మాట్లాడుతూ బండ బూతులు తిడుతూ నిన్ను చంపుతానని బెదిరించి అనుచిత వ్యాఖ్యలు చేయగా మనోవేదనకు గురైన పంచాయతీ కార్యదర్శి స్థానిక పోలీస్ స్టేషన్లో ధరావత్ సాయిపై ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు బచ్చోడు తండా వెళ్లి విచారణ చేపట్టిన పోలీసులు ధరావత్ సాయిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు బౌతికదాడులు సెల్ ఫోన్లలో బెదిరించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కూచిపూడి జగదీష్ తెలిపారు. మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు అంతా విద్యాసాగర్ పై అనుచితి వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.